సాక్షి
శ్రీకాకుళం
శనివారం । 27 । సెప్టెంబర్ । 2025



వేట సాగక..పూట గడవక!
మత్స్యకారులకు కష్టాలు తప్పడం లేదు. వేట నిషేధం తర్వాత ఐదుసార్లు తుఫాన్ హెచ్చరికలు రావడంతో ఉపాధికి దూరమవుతున్నారు.
- 8లో



స్పష్టత ఏదీ..?
రిమ్స్ వైద్యులు, అడ్మినిస్ట్రేటర్ మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. విధులపై స్పష్టత ఇవ్వాలని పలువురు వైద్యులు డీఎంఈకి నివేదించారు.
- 8లో

న్యూస్‌రీల్

నేడూ వర్షాలే

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. పలుచోట్ల ఈదురు గాలులు వీస్తున్నా నష్టం ప్రభావం పెద్దగా లేదని అధికారులు చెబుతున్నారు. ఈ నెల 24న జిల్లా వ్యాప్తంగా 724 మి.మీ., 25న 87.2 మి.మీ., 26న 132.2 మి.మీ.చొప్పున వర్షపాతం నమోదైంది. అల్పపీడన ప్రభావంతో శనివారం కూడా వర్షం కురిసే అవకాశముందని అధికారులు చెబుతున్నారు.

అంగన్‌వాడీల పనితీరు మెరుగుపడాలి


ఐసీడీఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అంగన్‌వాడీల పనితీరు మెరుగుపడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. శుక్రవారం మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ పౌష్టికాహారం సరఫరా నుంచి హాజరు రికార్డుల దాకా ప్రతి అంశాన్ని కచ్చితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో జరిగే కార్యకలాపాలను క్షుణ్ణంగా పరిశీలించి లోపాలు లేకుండా చూడాలని, డేటా ఎంట్రీలో తప్పులు చోటుచేసుకోకూడదన్నారు. సమస్యాత్మక అంగన్‌వాడీలను గుర్తించి సమగ్ర నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రీ-స్కూల్లో పిల్లల హాజరు సగటును ప్రతిరోజూ ట్రాక్ చేసి, ప్రస్తుతం ఉన్న స్థాయిని మరింత మెరుగుపరచాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం సహించేది లేదని స్పష్టం చేశారు. సేవలు సమర్థంగా అందించేలా సూపర్‌వైజర్లు, ఎంపీడీవోలు, సీడీపీవోలు, సచివాలయ సిబ్బంది సమన్వయంతో ముందుకు సాగాలని ఆదేశించారు. సమీక్షలో అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఐసీడీఎస్ పీడీ ఐ.విమల, నోడల్ ఆఫీసర్ పి.మణెమ్మ, ప్రాజెక్టు సీడీపీవోలు హాజరయ్యారు.

డిజిటల్ బుక్ ఆవిష్కరణ విజయవంతం చేయండి


ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: కూటమి ప్రభుత్వంలో అన్యాయానికి గురైన ప్రతి వైఎస్సార్‌సీపీ కార్యకర్తకూ అండగా ఉంటూ వారికి న్యాయం జరిగేలా డిజిటల్ బుక్ ఏర్పాటైందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ డిప్యూటీ సీఎం ధర్మాన కృష్ణదాస్ శుక్రవారం పేర్కొన్నారు. ఈ నెల 27న జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ జరుగుతుందని తెలిపారు. 28న నియోజకవర్గ కేంద్రాల్లో సమన్వయకర్తల ఆధ్వర్యంలో, సోమవారం మండల కేంద్రాల్లో నియోజకవర్గ సమన్వయకర్తల సమక్షంలో మండల పార్టీ అధ్యక్షులు డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించనున్నారని వివరించారు. మూడు దశల్లో జరిగే ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

డిజిటల్ బుక్ అంటే..
కూటమి పాలనలో అన్యాయానికి గురైన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు డిజిటల్ బుక్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయవచ్చు. వెబ్‌సైట్‌లోకి ఎంటర్ అయ్యాక ఫోన్ నంబర్ టైప్ చేయగానే లొకేషన్, కెమెరా పర్మిషన్ ఇవ్వాలి. అనంతరం కార్యకర్తకు జరిగిన అన్యాయాన్ని ఆధారాలతో సహా డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేయాలి. ఈ డేటా డిజిటల్ బుక్‌లో నిక్షిప్తమవుతుంది. అలాగే ఐవీఆర్ఎస్ విధానం ద్వారా 040-49171718కు నంబర్‌కు ఫోన్ చేసి కూడా డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

నేటి నుంచి అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు

వజ్రపుకొత్తూరు రూరల్: రైల్వే ప్రయాణికుల సౌకార్యార్థం అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27 నుంచి అందుబాటులోకి రానుంది. బ్రహ్మపూర్ నుంచి ఉద్నా వరకు నడిచే ఈ రైలు (19021/22)కు జిల్లాలో పలాస రైల్వే స్టేషన్‌లో హాల్ట్ సౌకర్యం ఇవ్వడంతో స్థానిక ప్రయాణికులకు వరంగా మారనుంది. శనివారం పలాస రైల్వే స్టేషన్‌లో రైలు నిలుపుదల కానుండటంతో స్వాగతం పలికేందుకు రైల్వే అధికారులు, ప్రజా ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.


ఇబ్రహీంపట్నం, కొండపల్లి ప్రాంతాల్లో థర్మల్ పవర్ ప్లాంట్‌లో ప్రతి రోజూ 35వేల టన్నుల బొగ్గు వినియోగం జరుగుతోంది. కొన్ని వందల రెట్లు కాలుష్యం వెదజల్లుతోంది. లారీల ద్వారా తరలించినప్పుడు రోడ్లపై పెద్ద ఎత్తున బూడిద కారుతోంది. ఈ ప్లాంట్ పెట్టినప్పుడు స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయని చెప్పారు. కానీ బూడిద, చర్మ వ్యాధులు, క్యాన్సర్ తప్ప మరేదీ రాలేదు.
- అసెంబ్లీలో తన నియోజకవర్గ పరిధిలో ఉన్న థర్మల్ పవర్ ప్లాంట్ పరిస్థితిపై టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ వివరించిన తీరిది

ఆమదాలవలస నియోజకవర్గం వెనకబడిన ప్రాంతం. ఈ ప్రాంత యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది నా ఆశయం. దాని కోసం థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు కోసం ప్రయత్నిస్తున్నాను. గడిచిన శాసన సభ్యునిగా ఎన్నికైన దగ్గరి నుంచి నా కోరిక ఇది. అసలు పొల్యూషన్ ఎక్కడ ఉండదు... అన్ని చోట్లా ఉంటుంది. కానీ, జాగ్రత్తలు తీసుకుని ప్లాంట్ ఏర్పాటు చేసేలా చూస్తాం. స్యూటిబులిటీ కోసం పరిశీలన జరిగింది. అంతా ఓకే అయితే ప్లాంట్ ఏర్పాటు చేసి తీరుతాను. ఎవరు అడ్డుకున్నా ఆగదు.
- ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ తరుచూ అంటున్న మాటలివి

అది అనర్థాల పవర్

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

- గతంలో థర్మల్ ప్లాంట్‌లను తరిమి కొట్టిన జిల్లా ప్రజలు
- సోంపేట, కాకరాపల్లి కాల్పులు ఇప్పటికీ గుర్తే
- ఇప్పుడు ఆమదాలవలస నియోజకవర్గంలో థర్మల్ పవర్ ప్లాంట్ పెడతామని మొండిపట్టు
- జనాలను రెచ్చగొట్టే విధంగా ఎమ్మెల్యే కూన రవికుమార్ వ్యాఖ్యలు
- ఆందోళన బాట పడుతున్న రెండు మండలాల ప్రజలు



వీరిద్దరూ టీడీపీ ఎమ్మెల్యేలే. వీరిద్దరూ చెబుతున్నది థర్మల్ పవర్ ప్లాంట్ల గురించే. కానీ ఒకరేమో థర్మల్ పవర్ ప్లాంట్ ద్వారా కాలుష్యం, వ్యాధులు తప్ప ఉద్యోగాలు రాలేదని అంటున్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తామంటున్న కూన రవికుమార్ మాత్రం ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని అంటున్నారు. ఇదివరకు థర్మల్ ప్రాజెక్టును తరిమి కొట్టిన చరిత్ర మన జిల్లాకు ఉంది. అది తెలిసినా కూన రవికుమార్ మళ్లీ థర్మల్ ప్లాంట్ ఏర్పాటు చేసి తీరుతానని చెబుతుండడమే అందరినీ విస్తుగొలుపుతోంది.

పచ్చని పల్లెల్లో చిచ్చు రేపిన సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా చరిత్రలో నిలిచిపోయిన ఉద్యమం నడిచింది. ఈ పోరాటాన్ని అణగదొక్కేందుకు జరిగిన పోలీసుల కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు వదిలారు. చివరికి ప్రజా ఉద్యమానికి ప్రభుత్వం తలొగ్గింది. పవర్ ప్లాంట్ ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. సంతబొమ్మాళి మండలం కాకరాపల్లిలో తంపర భూముల్లో కూడా థర్మల్ పవర్ ప్రాజెక్టును తలపెట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటే సోంపేట ఉద్యమాన్నే స్ఫూర్తిగా తీసుకుని ఇక్కడ ప్రజలు వ్యతిరేకించారు. ఇక్కడ కూడా ముగ్గురు ఆందోళనకారులు ఊపిరి వదిలారు. ఇందులో వైఎస్సార్‌సీపీ పూర్తిగా ప్రజల పక్షాన నిలవగా, ఒక్కో చోట ఒక్కో రకంగా టీడీపీ వ్యవహరించింది.

వద్దంటున్నా వినకుండా..
ఇప్పుడు మళ్లీ టీడీపీ థర్మల్ గాయాన్ని తట్టిలేపుతోంది. కూన రవికుమార్ వైఖరితో గిరిజనులకు కంటిమీద కునుకు ఉండటం లేదు. సరుబుజ్జిలి, బూర్జ మండలాల పరిధిలో రూ.30వేల కోట్లతో 1500 ఎకరాలకు పైగా 3200 మెగావాట్ల థర్మల్ క్రిటికల్ సూపర్ ఎలక్ట్రికల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించాలని ప్రభుత్వం చూస్తోంది. యువత ఉపాధి కోసం పవర్ ప్లాంట్ పెట్టి తీరుతామని, అభివృద్ధిని అడ్డుకుంటే అంతు చూస్తామని బెదిరింపులకు కూడా దిగుతున్నారు. నాడు జరిగిన సోంపేట, కాకరాపల్లి థర్మల్ ప్లాంట్లు వేరు ఇది వేరు అంటూ కూన సమర్థించుకుంటున్నారు. దీంతో ప్రజలు ఆందోళనబాట పట్టారు. గిరిజన, కమ్యూనిస్టులు, వైఎస్సార్‌సీపీ పక్షాలు వారి పక్షాన నిలబడి ఉద్యమానికి అండగా నిలుస్తున్నాయి.

ప్రాజెక్టు నేపథ్యమిది..
సరుబుజ్జిలి, బూర్జ మండలాల్లో గోపిదేవిపేట, మసానపుట్టి, బూర్జ మానుగూడ, జంగాలపాడు, బొడ్లపాడు, జేవీ పురం, అనంతగిరిపేట, వెన్నెలవలస-1, వెన్నెలవలస-2, తదితర గ్రామాల పరిధిలో ఈ ప్లాంట్‌ను రెండు విడతల్లో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఈ ప్రాజెక్టు ఏర్పాటైతే సుమారుగా 18 మిలియన్ మెట్రిక్ టన్నుల బొగ్గు వినియోగం జరగనుండగా, సుమారు 12టీఎంసీల నీరు అవసరం ఉంటుంది. కోటి 40లక్షల లీటర్ల మేర హైస్పీడ్ డీజిల్ కావల్సి ఉంటుందని ఆందోళనకారులు చెబుతున్నారు.

20 గ్రామాలకు అనర్థం
- థర్మల్ ప్రాజెక్టు వస్తే భూములను కోల్పోవడమే కాకుండా 20 గ్రామాల మానవ మనుగడే ప్రశ్నార్థకమవుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.
- దాదాపు 12 టీఎంసీల నీటిని వంశధార రిజర్వాయర్ నుంచే తీసుకెళ్లాల్సి ఉంటుంది.
- కాదూ కూడదంటే నాగావళి రిజర్వాయర్ నుంచి తీసుకురావాల్సి ఉంటుంది.
- అదే జరిగితే లక్షలాది ఎకరాలకు సాగునీరు అందదు.
- పవర్ ప్లాంట్ నుంచి 40శాతం మేర వ్యర్థాలు విడుదలవుతాయని, భూగర్భ జలాల్లోకి వెళ్లి పర్యావరణం, పంటలతో పాటు తాగునీరు, సాగునీరు కలుషితమవుతాయని ఆందోళనకారులు వాపోతున్నారు.


ప్లాంట్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ర్యాలీ చేస్తున్న పోరాట కమిటీ నాయకులు (ఫైల్)

అడ్డుకుని తీరుతాం



థర్మల్ పవర్ ప్లాంట్ వల్ల గాలి కాలుష్యం, నీటి కాలుష్యం, రేడియేషన్ దెబ్బతీస్తాయి. కాకరాపల్లి, సోంపేట థర్మల్ పవర్ ప్లాంట్‌ను పోరాడి రద్దు చేయించడానికి ఇదే కారణం. ఈ ప్లాంట్‌తో అంగవైకల్యంతో పిల్లలు పుట్టే అవకాశం ఉంది. వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ఓట్లు దండుకోవడానికి అప్పట్లో చంద్రబాబు ఒక్కో రకంగా మాట్లాడారు. బూడిద అమ్ముకోవడానికి టీడీపీ నాయకులు ఈ పనిచేస్తున్నారు. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అడ్డుకుని తీరుతాం.
- తమ్మినేని సీతారాం, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ సమన్వయకర్త, శ్రీకాకుళం.

ప్రాణత్యాగమైనా చేస్తాం



భావితరాల మనుగడ కోసం థర్మల్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా పోరాటం చేస్తాం. అవసరమైతే ప్రాణత్యాగమైనా చేస్తాం. అన్ని దేశాల్లో థర్మల్ పవర్ ప్లాంట్‌లు మూసివేసేస్తామని తీర్మానం చేస్తుంటే ఇక్కడ ఏర్పాటు చేయడానికి సిద్ధం చేయడమేంటి? ప్లాంట్ ముసుగులో ఇక్కడ భూములపై కూన రవికుమార్ కన్ను పడింది. దీనిపై పోరాటం చేస్తాం. వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది.
- చింతాడ రవికుమార్, వైఎస్సార్‌సీపీ అమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్త

పోడు చేసుకొని బతుకుతున్నాం



పోడు వ్యవసాయంపై ఆధారపడి మా కుటుంబాలు మొత్తం జీవిస్తున్నాం. ఇదే భూమిని నమ్ముకొని బతుకుతున్న మాలాంటి బడుగులపై ఈ ప్లాంటు పిడుగులా మారింది.
- సవర కురమయ్య, అద్దూరిపేట, బూర్జ మండలం

మీ ఉద్యోగాలు మాకొద్దు



ప్లాంట్ నిర్మిస్తే ఉద్యోగాలిస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి మా పంట భూములు కాజేయాలని చూస్తున్నారు. ఇలాంటి దుర్మార్గపు కుట్రలు సాగనీయం. మీ ఉద్యోగాలు వద్దు, మాపోడు వ్యవసాయం కావాలి. ప్లాంట్ నిర్ణయం వెనక్కి తీసుకోవాలి.
- సవర ఇమాంగో, అద్దూరిపేట, బూర్జ మండలం

మహాలక్ష్మీ నమోస్తుతే..


ఉర్లాం మార్కెట్ కూడలిలో కరెన్సీ నోట్లతో లక్ష్మీదేవిగా దర్శనమిచ్చిన దుర్గమ్మ

దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఉత్తరాంధ్రుల ఇలవేల్పు పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఒడిశా, పాతపట్నంతో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. జిల్లావ్యాప్తంగా దుర్గాదేవి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.
- పాతపట్నం/నరసన్నపేట


పాతపట్నంలో మహాలక్ష్మీదేవిగా నీలమణిదుర్గ


ఇచ్ఛాపురంలో స్కందమాతగా స్వేచ్ఛావతి అమ్మవారు

రెండోసారి.. నోటిఫికేషన్ జారీ


తరగతి గదిలో డిగ్రీ చదువుతున్న విద్యార్థులు

- డిగ్రీ ప్రవేశాలపై ఎట్టకేలకు మొద్దునిద్ర వీడిన కూటమి సర్కారు
- ఈ నెల 29 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు రిజిస్ట్రేషన్లు
- అక్టోబర్ 6న సీట్ల కేటాయింపు
- మరోవైపు కొనసాగుతున్న కాలేజీల సమ్మె

శ్రీకాకుళం న్యూకాలనీ:

రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు మొద్దునిద్ర వీడింది. డిగ్రీ ఫస్టియర్ ప్రవేశాల కోసం సకాలంలో దరఖాస్తులు చేసుకోలేని విద్యార్థుల కోసం రెండో విడత నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే మొదటి ఫేజ్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసినప్పటికీ పూర్తి స్థాయిలో క్లాసులు మొదలుకాలేదు. ఇంటర్మీడియెట్ ఫలితాలు వెలువడి నాలుగైదు నెలలు గడిచినా నోటిఫికేషన్ విడుదల చేయకుండా విద్యార్థులను మానసిక క్షోభకు గురిచేసిన విషయం తెలిసిందే.

ఆన్‌లైన్‌లోనే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ..
- 2025-26 విద్యా సంవత్సరానికిగాను డిగ్రీ అడ్మిషన్ల కోసం రెండో విడత ప్రవేశాలకు కాలేజియేట్ ఎడ్యుకేషన్ వెల్లడించిన మార్గదర్శకాల ప్రకారం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ఓసీ విద్యార్థులు రూ.400, బీసీలు రూ.300, ఎస్సీ/ఎస్టీలు రూ.200 నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి.
- ఈ నెల 26 నుంచి 29 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు
- 27 నుండి 29 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- ఈనెల 29 నుంచి అక్టోబర్ ఒకటి వరకు వెబ్ ఆప్షన్లు
- అక్టోబర్ 6న కాలేజీల్లో సీట్ల కేటాయింపు
- 7 నుంచి క్లాసులు ప్రారంభం

కాలేజీలు మూసివేతతో ఆందోళన..
కోట్లాది రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు విషయంలో రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ ప్రైవేటు డిగ్రీ కాలేజీలు సమ్మెబాటపట్టాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 22 నుంచి ప్రైవేటు కాలేజీల్లో క్లాసులు రద్దు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేటు కాలేజీలను మూసివేశారు. జిల్లాలో ఒక్క డిగ్రీ విద్యకు సంబంధించే జిల్లాలో 80 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు ఏపీ ప్రైవేటు కాలేజీల మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు సైతం తమకు సెమిస్టర్ పరీక్షలు సమీపిస్తుండటంతో దిగులు చెందుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని డిగ్రీ విద్యార్థులు మొరపెట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..
ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలో 100 డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో 16 ప్రభుత్వ, 84 ప్రైవేట్ కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో 28 వేల సీట్లు ఉన్నాయి. ఇందులో 8వేల సీట్లు కూడా భర్తీకావడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. కొన్నేళ్ల కిందట జిల్లా నుంచి 20 వేల వరకు సీట్లు నిండేవి. ప్రస్తుతం సీన్ రివర్స్ అయింది. డిగ్రీ ప్రవేశాల సంఖ్య క్రమంగా తగ్గుతూ వస్తోంది. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ఇంజినీరింగ్, ఫార్మసీ, ఐటీఐవైపు విద్యార్థులు చూస్తున్నారు. దీనికితోడు ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలు చేయకపోవడంతో అడ్మిషన్ల సంఖ్య గణనీయంగా పడిపోయిందని విద్యాసంస్థల మేనేజ్‌మెంట్ల ప్రతినిధులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..



డిగ్రీ ఫస్టియర్‌లో ప్రవేశాల కోసం వివిధ కారణాలతో అడ్మిషన్లు పొందలేని విద్యార్థుల కోసం రెండో విడత ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. విద్యార్థులు వెంటనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలి.
- డాక్టర్ కణితి శ్రీరాములు, శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ (ఐడీ కళాశాల) ప్రిన్సిపాల్

పీహెచ్‌సీ వైద్యుల సమ్మె సైరన్

- ఆన్‌లైన్ రిపోర్టుల నిలిపివేత
- ఈ నెల 29 నుంచి ఓపీ విధుల బహిష్కరణ
- వచ్చే నెల 3 నుంచి విజయవాడలో నిరాహార దీక్షలు


జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి అనితకు సమ్మె నోటీసు అందజేస్తున్న పీహెచ్‌సీ వైద్యులు

అరసవల్లి: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యులు సమ్మె సైరన్ మోగించారు. ముందస్తు నోటీసులను ఇప్పటికే రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉన్నతాధికారులకు అందజేసి ప్రభుత్వ విధులను నిలిపివేసేలా సన్నద్ధమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవకపోవడంతో పీహెచ్‌సీ వైద్యుల రాష్ట్ర సంఘం పిలుపు మేరకు శుక్రవారం నుంచి నల్లబ్యాడ్జీలతోనే విధులు నిర్వర్తిస్తూనే అధికారిక ఆన్‌లైన్ విధులు, రోజువారీగా పంపించాల్సిన ఆన్‌లైన్ నివేదికలను కూడా నిలిపివేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జిల్లాలో నిరసనల షెడ్యూల్ ప్రకారం నిర్వర్తించేలా చర్యలకు దిగారు. ఈ క్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖాధికారికి, కలెక్టరేట్‌కు కూడా సమ్మె నోటీసులను శుక్రవారం అందజేశారు. ఈ నెల 29 నుంచి ఓపీ సేవలను కూడా నిలిపివేసేలా నిర్ణయాన్ని అమలు చేయనున్న నేపథ్యంలో పేద, సామాన్య వర్గాలకు ప్రభుత్వ వైద్యం దూరం కానుంది.

నిరసనల షెడ్యూల్ ఇలా....
- నేడు సంచార చికిత్సలు వంటి క్యాంపు విధుల బహిష్కరణ
- 28న ప్రభుత్వ అధికారిక వాట్సాప్‌ల నుంచి నిష్క్రమణ
- 29 నుంచి ఓపీ(అవుట్ పేషంట్) సేవలు నిలుపుదల. ఎమర్జెన్సీ సర్వీసులైన డెలివరీలు, పాము కాటు, విషం తీసుకునే తదితర కేసులకు మాత్రమే అనుమతి.
- 30న జిల్లా కేంద్రంలో నిరసన
- అక్టోబర్ 1న జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ, వినూత్న నిరసన
- 3న విజయవాడలో నిరాహార దీక్షలు ప్రారంభం

అధికారుల తనిఖీలు.. బంగారం వర్తకుల్లో గుబులు

- నరసన్నపేటలో హోల్‌సేల్ షాపుల్లో సెంట్రల్ జీఎస్టీ అధికారుల తనిఖీలు
- భయంతో షాపులు మూసేసిన వ్యాపారులు
- వివరాలు వెల్లడించని అధికారులు

నరసన్నపేట : జిల్లాలో వ్యాపార కేంద్రమైన నరసన్నపేటలో కేంద్ర జీఎస్టీ అధికారులు శుక్రవారం రెండు బృందాలుగా ఏర్పడి హోల్‌సేల్ బంగారం షాపుల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. డీసీ వర్మ ఆధ్వర్యంలో విశాఖ నుంచి వచ్చిన అధికారులు తమ్మయ్యపేటలో ఉప్పు గిరి నివాసం, ఆదివరపుపేట కూడలిలో మన్మధరావు హోల్‌సేల్ షాపులో తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తనిఖీలు కొనసాగాయి. మూడేళ్లుగా జరిగిన వ్యాపారం, కట్టిన టాక్స్‌లపై ఆరా తీసినట్లు సమాచారం. కొన్ని రికార్డులు తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. అధికారులు వివరాలు మాత్రం వెల్లడించలేదు. పన్ను ఎగవేత బంగారం పెద్ద మొత్తంలో గుర్తించినట్లు తెలుస్తోంది. కోయంబత్తూరులో హోల్‌సేల్ వ్యాపారి ఒకరు సెంట్రల్ జీఎస్టీ అధికారులకు పట్టుబడ్డారని, ఈయన ఇచ్చిన సమాచారం మేరకు నరసన్నపేటలో రెండు హోల్‌సేల్ షాపుల్లో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.


ఓ హోల్‌సేల్ షాపులో తనిఖీలు చేస్తున్న కేంద్ర జీఎస్టీ అధికారులు

షాపులు మూసేసిన వ్యాపారులు..
జీరో బంగారం వ్యాపారం చేస్తూ అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి మోసం చేస్తున్న నరసన్నపేటలోని పలువురు బంగారం వ్యాపారులు తమ గుట్టురట్టు అవుతుందనే భయంతో వెంటనే షాపులను మూసేశారు. షట్టర్లు దించి ఇళ్లకు వెళ్లిపోయారు. బంగారం వ్యాపారుల చర్యల పట్ల స్థానికులు విస్తుపోతున్నారు. జీఎస్టీ అధికారులు వస్తే షాపులు మూసేసి వెళ్తున్నారంటే వీరు చేస్తున్న వ్యాపారం అంతా మోసమేనా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జూలై 17న బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో బంగారు ఆభరణాలపై వేసిన నకిలీ హాల్‌మార్క్ వ్యవహారం వెలుగుచూసిన విషయం తెలిసిందే.

రాత్రి 8 గంటల వరకు పోస్టాఫీసుల్లో ఆధార్ సేవలు

శ్రీకాకుళం అర్బన్: ప్రజలకు ఆధార్ సేవలను మరింత సులభతరం చేసే దిశగా శ్రీకాకుళం పోస్టల్ డివిజన్‌లోని హెడ్ పోస్టాఫీసులలో ఆధార్ సేవా కౌంటర్లు ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటాయని తపాలాశాఖ సూపరింటెండెంట్ వి.హరిబాబు శుక్రవారం తెలిపారు. శ్రీకాకుళం హెడ్ పోస్టాఫీస్, టెక్కలి హెడ్ పోస్టాఫీస్, ఆమదాలవలస హెడ్‌పోస్టాఫీస్‌లలో ఈ సేవలు లభ్యం కానున్నాయని పేర్కొన్నారు. కొత్త ఆధార్ నమోదు, పేరు/చిరునామా/పుట్టిన తేదీ/మొబైల్ నంబర్/ఇ-మెయిల్ ఐడీ నవీకరణ, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి అన్ని రకాల ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు. సేవలను పొందేవారు గుర్తింపుకార్డు, చిరునామా, పుట్టిన తేదీకి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

స్కాలర్‌షిప్ పరీక్ష వాయిదా..
పోస్టల్ శాఖకు సంబంధించిన 'దీన్ దయాల్ స్పర్శ యోజన' ఫిలాటలీ స్కాలర్‌షిప్ మొదటి స్థాయి పరీక్ష తేదీలో మార్పు చోటు చేసుకుందని హరిబాబు పేర్కొన్నారు. పాఠశాలలకు దసరా సెలవులు రావడంతో పరీక్షను వచ్చే నెల 12వ తేదీకి వాయిదా వేసినట్లు చెప్పారు. పూర్తి వివరాలకు పోస్టాఫీసులో గానీ, యూఐడీఏఐ అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

దంచికొట్టిన వాన

ఆమదాలవలస రూరల్: జిల్లాలో శుక్రవారం పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఆమదాలవలసలో సుమారు రెండు గంటల పాటు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రైల్వే అండర్ టన్నెల్ వద్ద భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది.


ఆమదాలవలస అండర్ టన్నెల్ వద్ద వరదనీరు

క్లుప్తంగా

వ్యవసాయ రుణాల కోసం ఆందోళన



సవర చొర్లంగిలో నిరసన తెలుపుతున్న గిరిజనులు

హిరమండలం : వ్యవసాయ రుణాలు అందించాలని హిరమండలం మండలంలోని 50 గిరిజన గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ మేరకు శుక్రవారం సవర చొర్లంగిలో గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో డీపట్టా భూములకు బ్యాంకులు ద్వారా రుణాలు అందేవని, భూముల రీ సర్వే తర్వాత 1బీ అడంగల్ రాకపోవడంతో రుణాల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. 1బీ ఉంటేనే రుణాలు ఇస్తాం.. రెన్యూవల్ చేస్తామని బ్యాంకు సిబ్బంది చెబుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వ్యవసాయ రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. నిరసన కార్యక్రమంలో గిరిజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి



వంట గదులను పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

గార: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. శుక్రవారం అంపోలు జిల్లా జైలును సందర్శించారు. ముద్దాయిలకు అందించే ఆహార పదార్థాలను రుచి చూశారు. గ్రంథాలయం, మహిళా బ్యారెక్‌లు పరిశీలించి సౌకర్యాలపై ఆరా తీశారు. పలువురి నుంచి బెయిల్ పిటీషన్ల కోసం దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో జైలర్ దివాకర్‌నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయితో వ్యక్తి అరెస్టు



నిందితుడిని చూపిస్తున్న పోలీసులు

పలాస: తమిళనాడు రాష్ట్రానికి చెందిన మోరీస్ అనే వ్యక్తిని గంజాయితో శుక్రవారం అరెస్టు చేసినట్లు పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ ఎ.కోటేశ్వర రావు తెలియజేశారు. పలాస రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫామ్‌లో తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా తిరుగుతూ కనిపించాడన్నారు. అతని బ్యాగ్‌లో తనిఖీలు చేయగా గంజాయి పట్టుబడినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో రాయగడలో కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. అతని వద్ద నుంచి గంజాయి, సెల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. గంజాయిని తూకం వేయగా 14 కిలోలు ఉన్నట్లు వెల్లడించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రథమ చికిత్సపై శిక్షణ



ప్రథమ చికిత్స శిక్షణ నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ప్రథమ చికిత్సపై ఒక్కరోజు శిక్షణ శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణతో ఎంతో ప్రయోజనం ఉందన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.అనిత మాట్లాడుతూ ప్రథమ చికిత్స శిక్షణ ప్రతి ఒక్కరికీ ఈ రోజుల్లో అవసరమని, ప్రాణనష్టం తగ్గించడంలో ప్రధాన భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు. అనంతరం అభ్యర్థులకు ధృవపత్రాలు అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



- వరుస తుఫాన్లతో మత్స్యకారుల ఆకలి కేకలు
- వేట నిషేధం తర్వాత ఐదుసార్లు తుఫాన్ హెచ్చరికలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కుటుంబాలు
- ఆదుకోవాలని వేడుకోలు

వేట సాగక.. పూట గడవక..!



తుఫాన్‌తో వేట సాగని రోజులు

- జూన్ 30వ తేదీ నుంచి 2 రోజులు
- జూలై 24వ తేదీ నుంచి 6 రోజులు
- ఆగస్టు 13వ తేదీ నుంచి 8 రోజులు
- ఆగస్టు 26వ తేదీ నుంచి 5 రోజులు
- సెప్టెంబర్ 22వ తేదీ నుంచి 8 రోజులు

గార:

కడలి తల్లి కరుణిస్తే గానీ కడుపు నిండని పరిస్థితి మత్స్యకారులది. వేట సాగితేనే కుటుంబాల పూట గడుస్తుంది. అయితే ఇటీవల వరుసగా ఏర్పడుతున్న తుఫాన్లు మత్స్యకారుల్లో ఆందోళన సృష్టిస్తున్నాయి. సంద్రం అల్లకల్లోలంగా మారుతుండడంతో వేట సాగడం లేదు. వేట నిషేధం అనంతరం వరుసగా నాలుగు నెలల్లో ఏకంగా 27 రోజుల పాటు తుఫాన్లు, వాయుగుండాల ప్రభావం వలన వేటకు వెళ్లలేకపోయారు. దీంతో ఆయా కుటుంబాల్లో ఆకలి కేకలు వినిపిస్తున్నాయి. అయితే రాష్ట్రంలో ఎక్కడ తుఫాన్ సంభవిస్తున్నా వాతావరణ హెచ్చరికలు ఆధారంగా అప్రమత్తత పేరుతో వేట నిలిపేయాలని అధికారులు దండోరా వేయిస్తున్నారు. కానీ ఒక్కోసారి వాతావరణ హెచ్చరికలకు విరుద్ధంగా సముద్రంలో ఎటువంటి ఒడిదుడుకులు లేకపోయినా వేటకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉండిపోతున్నామని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోతున్నారు. అందువలన ప్రతీ ఏడాది ఏప్రిల్ 15 నుంచి జూన్ 15 వరకు వేట నిషేధ సమయంలో భృతి ఇస్తున్నట్టే.. తుఫాన్, వాయుగుండాల సమయంలో వేటకు వెళ్లకుండా ఆర్థిక ఇబ్బందులు పడుతున్న మత్స్యకారులకు భృతి ఇవ్వాలని కోరుతున్నారు.



వేట నిలిచిపోవడంతో బందరువానిపేట తీరంలో ఉన్న పడవలు

జిల్లాలో పరిస్థితి

జిల్లాలో 193 కిలోమీటర్ల మేర ఉన్నటువంటి తీర ప్రాంతంలోని 11 మండలాల్లో మత్స్యకారులు జీవనోపాధి సాగిస్తున్నారు. మొత్తం 1,526 మెకనైజ్డ్ బోట్లు, 2,606 నాన్ మెకనైజ్డ్ బోట్లుపై వేట సాగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వేట నిషేధ భృతి అర్హులైన మత్స్యకారులందరికీ అందిస్తే.. కూటమి ప్రభుత్వం అనేక ఆంక్షలు పెట్టి మత్స్యకారులను తగ్గించిందన్న విమర్శలున్నాయి. అలాగే అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకార భృతి ఒక సంవత్సరం ఇవ్వకపోవడం గమనార్హం.

పస్తులతో జీవనం



కొన్ని రోజులుగా సముద్రంలో వేట సక్రమంగా సాగడం లేదు. తరుచూ తుఫాన్‌లు ఏర్పడడంతో సముద్రం అల్లకల్లోలంగా మారుతోంది. ఏ రోజుకారోజు వేట సాగించి జీవిస్తుంటాం. ఈ సమయంలో రోజుల తరబడి వేట సాగకపోతుండడంతో జీవనం కష్టతరంగా ఉంటోంది. పస్తులతో కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఈ ఏడాది ఎక్కువగా వాయుగుండాలు, తుఫాన్లు వస్తుండడంతో బోట్లు, వలలు భద్రపర్చుకోవడం కష్టతరంగా మారుతోంది.

– పుక్కళ్ల తవిటయ్య, మత్స్యకారుడు, బందరువానిపేట

ప్రత్యేక భృతి ప్రకటించాలి



సముద్రంలో వేట సాగించేందుకు వాతావరణం అనుకూలంగా ఉండడం లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో వేటకు విరామం తప్పడం లేదు. వేట నిషేధ భృతి మాదిరిగానే వేట విరామ సమయంలో మత్స్యకారుల కుటుంబాలను ఆదుకునేలా ప్రత్యేక భృతిని ప్రకటించాలి. జీవనోపాధి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. మత్స్యకార భరోసా రెండేళ్లకు ఒక ఏడాది మాత్రమే అందించారు. మరో ఏడాది భరోసా అందించి ఆదుకోవాలి.

– కోనాడ నర్సింగరావు, జిల్లా మత్స్యకార సంఘం మాజీ అధ్యక్షుడు

పోక్సో కేసు నమోదు

కవిటి: మండలంలోని ఆర్.బెలగాం ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఒక బాలికను ప్రేమ పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్న అభియోగంపై శావసానపుట్టుగకు చెందిన విశ్వనాథంపై పోక్సో కేసు గురువారం నమోదు చేసినట్లు కవిటి ఎస్‌ఐ వి.రవివర్మ శుక్రవారం తెలిపారు.

రాకపోకలకు అంతరాయం

ఆమదాలవలస రూరల్: మండలంలోని తొగరాం గ్రామం వద్ద ఇసుక లారీ వలన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాతూరు ఇసుక ర్యాంపు నుంచి అధిక బరువుతో వచ్చిన లారీ రహదారికి అడ్డంగా ఆగిపోయింది. దీంతో ఇరువైపుల నుంచి వచ్చిన వాహనాలు రాకపోకలు సాగించేందుకు అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. పలు వాహనాలు గంటల తరబడి నిలిచిపోయాయి. సుమారు ఆరు గంటలపాటు బస్సులు, ఆటోలతో పాటు అనేక భారీ వాహనాలు నిలిచిపోవడంతో అవస్థలు తప్పలేదు.

జిల్లా ఆర్‌ఐఓగా సురేష్‌కుమార్



రేగ సురేష్‌కుమార్

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా ప్రాంతీయ పర్యావరణాధికారి(ఆర్‌ఐఓ)గా రేగ సురేష్‌కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డ్ డైరెక్టర్ /సెక్రెటరీ నారాయణ భరత్ గుప్తా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేష్‌కుమార్ జిల్లా ఇంటర్మీడియట్ విద్య డీవీఈవోగా పనిచేస్తున్నారు. ఇప్పటివరకు ఆర్‌ఐఓగా పనిచేసిన ప్రగడ దుర్గారావు ఈ నెలతో ఉద్యోగ విరమణ చేయనుండటంతో డీవీఈవో సురేష్‌కుమార్‌కు బాధ్యతలు అప్పగించారు.

కింజరాపు కుటుంబం దోచుకుంటోంది

- అక్రమాలపై అధికారులు దృష్టి సారించడం లేదు
- వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్



విలేకరులతో మాట్లాడుతున్న పేరాడ తిలక్

టెక్కలి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కింజరాపు కుటుంబం జిల్లాలో మైనింగ్ ఆదాయంతో పాటు ఇతర ప్రభుత్వ ఆదాయ వనరులన్నీ దోచుకుంటోందని వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం టెక్కలిలోని ఆ పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. విజిలెన్స్ ఎస్పీ నిరంకుశ వైఖరితో కింజరాపు కుటుంబం చేస్తున్న అక్రమాలపై దృష్టి సారించకుండా, వైఎస్సార్‌సీపీ నాయకులకు చెందిన క్వారీలు, క్రషర్లపై కక్షపూరితమైన చర్యలకు పాల్పడుతున్నారని దుయ్యబట్టారు. దోపిడీపై ఆధారాలతో సహా చెబుతున్నా మైనింగ్ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు.

అక్టోబర్ 6న ముట్టడి

కింజరాపు కుటుంబం చేస్తున్న మైనింగ్ అక్రమాలతో పాటు మైన్స్ అధికారుల కక్ష సాధింపు చర్యలపై తిరుగుబాటు చేస్తున్నట్లు తిలక్ తెలియజేశారు. ఈ మేరకు అక్టోబర్ 6వ తేదీన టెక్కలిలో మైన్స్ కార్యాలయాన్ని ముట్టడికి పిలుపునిచ్చారు. కూటమి కక్ష సాధింపుతో నష్టానికి గురైన మైనింగ్ నిర్వాహకులతో పాటు రాజకీయ పార్టీలు, కార్మికులు తరలి రావాలని కోరారు. సొంత నియోజకవర్గంలో రైతులకు యూరియా ఇవ్వలేని అసమర్థత మంత్రి అచ్చెన్నాయుడు అని ఎద్దేవా చేశారు. ఇటీవల జరిగిన కొత్తమ్మ తల్లి ఉత్సవాలు ఏర్పాట్లలో పూర్తిగా వైఫల్యం కనిపించిందన్నారు. అధికారులు భక్తుల సౌకర్యాలపై దృష్టి సారించకుండా మంత్రి అచ్చెన్నాయుడు చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ మెప్పు కోసం ఆరాటపడ్డారని మండిపడ్డారు. కలెక్టర్, ఎస్పీ సైతం టీడీపీ నాయకుల సేవలో నిమగ్నం కావడం సిగ్గుచేటన్నారు. కొత్తమ్మ తల్లి ఉత్సవాల నిర్వహణలో ప్రభుత్వం ఇచ్చిన నిధులు, చేసిన ఖర్చులపై దేవదాయ శాఖ అధికారులు శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హెలీకాఫ్టర్ రైడ్ పేరుతో భక్తుల నుంచి దోపిడీ చేసి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు సొంత ప్రచారాలు చేసుకున్నారని దుయ్యబట్టారు. ఇటీవల నందిగాం మండలంలో ఒక ఫైనాన్స్ సంస్థ దళిత కుటుంబాన్ని వేధిస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని మండిపడ్డారు. సినీ నటుడు బాలకృష్ణ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విమర్శలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సమావేశంలో నందిగాం ఎంపీపీ ఎస్.శ్రీరామ్మూర్తి, టెక్కలి వైస్ ఎంపీపీ పి.రమేష్, నాయకులు కె.అజయ్, ఎ.రాహుల్, చిన్ని జోగారావు, బి.రాజేష్, దానయ్య, కర్నిక జీవన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నగరంలోని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌తో కలిసి అధికారులు సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారిన ధరల విషయంపై ప్రజలకు తెలియజేయాలన్నారు. ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ తగ్గింపు, తగ్గింపు వలన సేవింగ్స్ గురించి వివరించాలని పేర్కొన్నారు. పోస్టర్లు తయారు చేసి సచివాలయాలు, గ్రామ, మండలాల వారీగా ఏర్పాటు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జీఎస్టీ డిప్యూటీ కమిషనర్, శ్రీకాకుళం జిల్లా సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ నోడల్ ఆఫీసర్ స్వప్న దేవి మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్ కార్యక్రమం ఈనెల 22వ తేదీన ప్రారంభమైందన్నారు. జీఎస్టీ తగ్గింపు వలన పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సుధాకర్, డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, డీపీవో భారతి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి



ప్రమాద స్థలంలో వైకుంఠరావు మృతదేహం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామం వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందినట్లు కోటబొమ్మాళి పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. కొత్తపల్లి గ్రామానికి చెందిన వాన వైకుంఠరావు(65) గురువారం సాయంత్రం సరియాపల్లి గ్రామ సమీపంలో ఉన్న తన పొలం పనికి వెళ్లి తిరిగి నడిచి వస్తుండగా, అదే మార్గంలో కప్పల రమణ అనేవ్యక్తి వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వస్తూ ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో వెంకటరావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం శుక్రవారం మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్థాపంతో ఆత్మహత్య



బొమ్మాళి శిరీష (ఫైల్)

బూర్జ: మండలంలోని ఉప్పినివలస గ్రామానికి చెందిన బొమ్మాళి శిరీష (22) గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శిరీషకు తల్లిదండ్రులు వివాహ సంబంధాలు చూస్తుండగా ఆమె తిరస్కరిస్తూ ఉండేది. వివాహం చేసుకోనని.. తన చిన్నాన్న దగ్గర చదువుకుంటానని చెప్పేది. ఈ క్రమంలో బుధవారం భోజనాల తర్వాత పక్క ఇంటికి వెళ్లి మాట్లాడుతుండగా, ఆమె తల్లి తనకు సాయం చేయకుండా పక్క ఇంటికి ఎందుకు వెళ్లావని మందలించడంతో మనస్థాపం చెంది ఇంట్లో ఉన్నటువంటి గడ్డిమందు తాగేసింది. తల్లి గన్నెమ్మ చూసి వెంటనే 108 సాయంతో శ్రీకాకుళం ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. మృతురాలికి తండ్రి రాజు, తల్లి గన్నెమ్మ, అక్క దివ్య, డిగ్రీ చదువుతున్న తమ్ముడు మని ఉన్నారు. తల్లి గన్నెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎం.ప్రవళ్లిక తెలియజేశారు.

స్పష్టత ఏదీ..?

- విధులపై డీఎంఈకి రిమ్స్ వైద్యుల నివేదన
- అడ్మినిస్ట్రేటర్, వైద్యుల మధ్య కోల్డ్ వార్
- అపారిశుద్ధ్యంపై కలెక్టర్ మండిపడడంతో మనస్థాపం



శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

శ్రీకాకుళం:

రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులు, వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యాధికారులు, ఇతర అధికారుల విధులు ఏమిటనే దానిపై స్పష్టత ఇవ్వాలని రిమ్స్‌లో పనిచేస్తున్న పలువురు వైద్యులు డీఎంఈకి నివేదించారు. వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న ఆస్పత్రుల్లో ఆరు నెలల క్రితం వరకు ఎటువంటి సమస్య ఉండేది కాదు. కళాశాల, ఆస్పత్రుల్లో సమస్యలన్నింటినీ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి సూపరింటెండెంట్, ఆర్‌ఎంవోలు పర్యవేక్షించేవారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఏడు నెలల క్రితం అడ్మినిస్ట్రేటర్ అంటూ ఒక పోస్టును క్రియేట్ చేసి డీడీ స్థాయి అధికారిని నియమించింది. దీంతో అప్పటినుంచి సమస్యలు తలెత్తుతున్నాయి.

ఇప్పటికే కేజీహెచ్ నుంచి రాష్ట్రస్థాయికి

ఇటువంటి వ్యవహారం ఇప్పటికే విశాఖపట్నంలోని కేజీహెచ్ నుంచి రాష్ట్రస్థాయికి చేరగా, తాజాగా శ్రీకాకుళం వ్యవహారం కూడా చేరింది. శ్రీకాకుళంలో అడ్మినిస్ట్రేటర్, వైద్యుల మధ్య ఎప్పటినుంచో కోల్డ్ వార్ జరుగుతోంది. దీనిపై సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో లోలోనే మదన పడుతూ వచ్చారు. తాజాగా ఐదు రోజుల క్రితం కలెక్టర్ రిమ్స్‌లో జరిగిన మొక్కల నాటే కార్యక్రమానికి వచ్చి, హాస్టల్, వార్డులను ఆకస్మికంగా తనిఖీ చేసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అడ్మినిస్ట్రేటర్ వ్యవస్థను నెలకొల్పినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం వారి విధి విధానాలను ప్రకటించింది. పారిశుద్ధ్యం, సెక్యూరిటీ, ఆస్పత్రికి వచ్చే రోగులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ఆవరణను పరిశుభ్రంగా ఉండేటట్లు చూడడం వంటి బాధ్యతలను అప్పగించింది. అయితే శ్రీకాకుళం పరిస్థితి ఇందుకు పూర్తి భిన్నంగా ఉంది. తన విధులను వదిలి వైద్యుల విధుల్లో అడ్మినిస్ట్రేటర్ తలదూర్చడం వలన వైద్యులు, అడ్మినిస్ట్రేటర్ మధ్య వివాదం రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఇదిలా ఉండగా తాజాగా ఓ వైద్యురాలి సేవలను ఓ గదికి పరిమితం చేసి, కంప్యూటర్ ఆపరేటర్ తరహాలో పనిచేయిస్తుండడాన్ని ప్రశ్నించిన వైద్యులను, దీనిపై ప్రచురితమైన వార్త కథనాలను ఉద్దేశించి ఏనుగులు వెళ్తుంటే కుక్కలు మొరుగుతాయి దానిని పట్టించుకోవాల్సిన అవసరం లేదని అడ్మినిస్ట్రేటర్ అనడాన్ని వైద్యులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఎవరి విధులు ఏమిటన్న దానిపై స్పష్టత ఇవ్వకపోతే రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు, ఆస్పత్రుల్లో వివాదాలు తలెత్తే ప్రమాదం ఉంటుందన్నారు. తక్షణమే విధులను తెలియజేస్తూ ఉత్తర్వులు వెలువరించాలని వైద్యులు రెండు రోజుల క్రితం డీఎంఈకి నివేదించి అక్కడి నుంచి వచ్చే సమాధానం కోసం వేచి చూస్తున్నారు.

ఇంజనీరింగ్ అధికారులదీ ఇదే పరిస్థితి

రిమ్స్‌లో పనిచేస్తున్న ఏపీహెచ్‌ఎంహెచ్‌ఐడీసీ ఇంజనీరింగ్ అధికారుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గత నెల 30వ తేదీన ఈఈగా పనిచేసిన సత్యప్రభాకర్ పదవీ విరమణ చేయడంతో ఆయన స్థానంలో విశాఖపట్నంలో క్వాలిటీ కంట్రోల్ డీఈ గా పనిచేస్తున్న ప్రమోద్ కుమార్‌ను ఇన్‌చార్జి ఈఈగా పూర్తి అదనపు బాధ్యతలతో నియమించారు. అయితే ఆయన వారంలో మూడు నాలుగు రోజులు మాత్రమే శ్రీకాకుళం వస్తూ ఉండడం, తరచూ సెలవులు పెడుతూ ఉండడంతో ఇంజనీరింగ్ అధికారుల మధ్య కూడా విభేదాలు తలెత్తాయి. ఇటీవల కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసినప్పుడు, నీటిని తరచూ పరీక్ష చేయించడం లేదని వృథాగా వదిలేస్తున్నారని.. మరలా ఇదే గమనిస్తే క్రిమినల్ చర్యలు తీసుకుంటామని డీఈని హెచ్చరించడంతో వివాదం ముదిరిపోయింది. ఆరోజు ఈఈ ఉన్నప్పటికీ కలెక్టర్‌కు ఎదురుపడకుండా ఉండటం వల్ల డీఈపై కలెక్టర్ ఆగ్రహం వెలిబుచ్చారు. ఇలా బాధ్యత కలిగిన అధికారులు తప్పించుకుంటూ బాధ్యత లేని అధికారులు ఉన్నతాధికారుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందన్న ఆవేదన అటు వైద్యులు, ఇంజినీరింగ్ అధికారులతో పాటు మరికొందరు ఉద్యోగుల్లో ఉంది. ఇప్పటికైనా రాష్ట్ర అధికారులు స్పష్టత ఇవ్వకుంటే కేజీహెచ్ స్థాయిలోనే వివాదం ముదిరే ప్రమాదం ఉంది.

యువతకు వికసిత్ భారత్ క్విజ్

శ్రీకాకుళం న్యూకాలనీ : భారతదేశ భవిష్యత్తును తీర్చిదిద్దే లక్ష్యంతో 'వికసిత్ భారత్ – 2047' దార్శనికతలో భాగంగా కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ 'వికసిత్ భారత్ యంగ్ చాలెంజ్ క్విజ్' నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సీఈవో వి.వి.అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ప్రధానమంత్రి సూచనల మేరకు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 15 నుంచి 29 ఏళ్ల యువత ఎంట్రీ ఫీజు లేకుండా క్విజ్‌లో పాల్గొనవచ్చని తెలిపారు. బహుళ ఎంపికల విధానంలో జరిగే ఈ పోటీని తెలుగు సహా 12 భాషల్లో మై భారత్ పోర్టల్‌ను అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. ఆన్‌లైన్ క్విజ్‌లో పాల్గొనడానికి అక్టోబర్ 15 చివరి గడువుగా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భవిష్యత్ భారత నిర్మాణంలో యువత కీలక పాత్ర పోషించాలన్న లక్ష్యంతోనే ఈ క్విజ్ నిర్వహిస్తున్నామని తెలిపారు.

పుస్తెల తాళ్లు చోరీ




రణస్థలం: సీసీ ఫుటేజీలో నమోదైన మహిళల దృశ్యాలు

పాతపట్నం: మండలంలోని పాశీగంగుపేట, చంద్రయ్యపేట గ్రామాల్లో ఇంట్లోని నిద్రిస్తున్న ఇద్దరు మహిళలు మెడల్లో నాలుగు తులాల బంగారం పుస్తెల తాళ్లు చోరీకి గురయ్యాయని ఎస్‌ఐ కె.మధుసూధనరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పాశీగంగుపేట గ్రామానికి చెందిన గంగు రాము, అతని భార్య గంగు లక్ష్మి అలియాస్ మీరమ్మలు గురువారం రాత్రి ఇంట్లో నిద్రించారు. అయితే అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి దొంగ చొరబడి లక్ష్మి మెడలోని రెండు తులాల బంగారం పుస్తెల తాడును చోరీ చేశాడు. అలాగే చంద్రపేట గ్రామానికి చెందిన మొర్రి వెంకటరమణ, అతని భార్య మొర్రి పద్మవతిలు ఇంట్లో నిద్రిస్తున్న సమయంలోనూ మెడలోని రెండు తులాల బంగారం పుస్తలతాడు చోరి జరిగినట్లు తెలిపారు. రెండు చోరీలపై కేసు నమోదు చేశారు.

బంగారం దుకాణంలో చోరీ

రణస్థలం: లావేరు మండలంలోని బుడుమూరు గ్రామ రహదారికి ఆనుకుని ఉన్న శ్రీవిజయదుర్గా బంగారు నగల దుకాణంలో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. బంగారు వస్తువులతో పాటు గా వెండి వస్తువులను అపహరించారు. బాధిత దుకాణదారుడు, లావేరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కలిశెట్టి గూడెం గ్రామానికి చెందిన కలిశెట్టి కృష్ణ బుడుమూరులో బంగారం దుకాణం నడుపుతున్నాడు. షాపునకు శుక్రవారం మధ్యాహ్నం గుర్తు తెలియని ముగ్గురు మహిళలు నగలు కొనుగోలుకు చేసేందుకు వచ్చారు. యజమానిని మాటల్లో పెట్టి బేరమాడారు. అనంతరం కొనుగో లు చేయకుండానే వెనుదిరిగారు. వారు షాపు విడి చి వెళ్లగా సీసీ ఫుటేజీ పరిశీలించిన యాజమాని కృష్ణ చోరీ జరిగిందని గుర్తించారు. సుమారు 3 గ్రాముల బంగారం ముక్కు పుడకలు నాలుగు, 480 గ్రాముల 6 జతల వెండి పట్టీలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. షాపు యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జి.లక్ష్మణరావు తెలిపారు.

హోటల్‌లో అగ్ని ప్రమాదం



అబీబీ హోటల్‌లో మంటలు చెలరేగిన దృశ్యం

పాతపట్నం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న అబీబీ డ్రైవ్ ఇన్ హోటల్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. హోటల్ మొదటి ఫ్లోర్ మొత్తం పూర్తిగా మంటల్లో కాలి బూడిదయింది. ప్రమాదం సంభవించిన సమయంలో హోటల్‌లో పలువురు భోజనం చేయడంతో పాటు సిబ్బంది పనిచేస్తున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగిందని హోటల్ యాజమాని రెడ్డి తెలిపారు. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని, ఆస్తి నష్టం రూ.2 లక్షల వరకు ఉంటుందంటున్నారు. సంఘటన జరిగిన వెంటనే పోలీసులు, రెవెన్యూ సిబ్బంది చేరుకుని, ప్రమాదం వివరాలు నమోదుచేసుకున్నారు.